క్లుప్తంగా

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



జగపతినగరంలో చెరువులో గంబూషియా చెపలను వదులుతున్న అధికారులు

కిర్లంపూడి: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు రాంబాబునాయక్ సూచించారు. దోమల సంతానోత్పత్తి నివారణకు మంగళవారం జగపతినగరంలోని చెరువులు, కాలువల్లో గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ మాట్లాడుతూ డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు దోమ తెరలు విధిగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సత్యప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

జగ్గంపేట: పదహారో నంబర్ జాతీయ రహదారిపై జగ్గంపేట నియోజకవర్గ పరిధిలోని 10 గ్రామాల్లో ప్రజలకు ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరారు. జగ్గంపేటలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారి విస్తరణ అనంతరం జగ్గంపేట నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో సుమారు 30 వేల ప్రమాదాలు జరిగాయని, వీటిలో 5 వేల మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఇప్పటికీ జగ్గంపేట జేవీఆర్ సెంటర్, గ్రామాల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు హైవే అధికారులు చర్యలు చేట్టాలని కోరారు. దీనిపై కేంద్ర మంత్రి గడ్కరిని కలిసి వినతిప్రతం సమర్పిస్తానని తెలిపారు. అవసరమైతే అన్ని పార్టీలతో కలిసి పోరాటం చేస్తామని చెప్పారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జగ్గంపేట: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జగ్గంపేట ప్రాజెక్టు మహాసభ స్థానిక యూటీఎఫ్ భవనంలో మంగళవారం జరిగింది.ఈ సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ జగ్గంపేట ప్రాజెక్టు అధ్యక్షురాలిగా కె.రత్నం, కార్యదర్శిగా బి.సుజాత, కోశాధికారిగా వైవీ రాజేశ్వరి, ఉపాధ్యక్షురాలిగా ఆర్.శ్యామల, కార్యదర్శిగా పర్వీన్, సుభారత్నం, గౌరవ అధ్యక్షురాలిగా ఎరుబండి చంద్రావతిలీల ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

మహాసభను విజయవంతం చేయాలి



ఏలేశ్వరంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో ఈ నెల 30న నిర్వహించే సంచార, అర్ధసంచార, విముక్తి జాతుల మహాసభను విజయవంతం చేయాలని బీజేపీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మచ్చా శివప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విశ్వనాథపల్లి శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. పట్టణంలో మంగళవారం బీజేపీ నేత పైల సుభాష్‌చంద్రబోస్, పట్టణ అధ్యక్షుడు పైల అయ్యప్ప ఆధ్వర్యంలో మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. విజయవాడలో జరిగే మహాసభకు ప్రజలు వేలాదిగా తరలిరావాలన్నారు. మహాసభలో సంచార, అర్ధసంచార, విముక్తి జాతుల సమస్యలపై చర్చించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రూరల్ అధ్యక్షుడు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల మహాసభను జయప్రదం చేయండి

జగ్గంపేట: విజయవాడలో ఈ నెల 30న నిర్వహించే సంచార, అర్ధ సంచార, విముక్తి జాతుల మహాసభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విశ్వనాథపల్లి శ్రీనివాసరాజు తెలిపారు. ఈ మేరకు స్థానిక రంగవల్లి నగర్‌లోని సంచార జాతుల వారికి మంగళవారం ఆహ్వాన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మచ్చా శివప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల కృష్ణవర్మ, తదితరులు పాల్గొన్నారు.

మండల అధికారుల నంబర్లు

కోటనందూరు:

తహసీల్దార్	80088 03205
ఎంపీడీఓ	98496 63415
మండల వైద్యాధికారి	76750 32399
వ్యవసాయాధికారి	83310 56617
ఎంఈఓ-1	89856 02864
ఎంఈఓ-2	96529 81857
కోటనందూరు పశువైద్యాధికారి	86398 13895
పాతకొట్టాం పశువైద్యాధికారి	94919 34613
ఎస్సై	94409 00773

వర్షాకాలం.. వ్యాధుల గాలం

- పట్టణంలో అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
- సీజనల్ జ్వరాలపై ఆందోళన చెందుతున్న ప్రజలు
- పారిశుధ్య సిబ్బంది కొరతతో ఇక్కట్లు
- పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



తుని మార్కెట్ యార్డు రోడ్డులో వ్యర్థాలు

తుని: అల్పపీడనం ప్రభావంతో ఇటీవల భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పరిశుభ్రత పాటించకపోతే వ్యాధులు సోకే అవకాశం ఉంది. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. తుని పట్టణం 7.02 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. సుమారు 60 వేలకు పైగా జనాభా ఉన్నారు. ఇందులో ఏటా 20 వేల మంది పలు రకాల వ్యాధులకు గురవుతున్నారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు పారిశుధ్యం నిర్వహణపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

పందుల సంచారంతో అవస్థలు

పట్టణంలో యథేచ్ఛగా పందులు సంచరిస్తున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్యం క్షీణతకు పందులు కారణమని అధికారులకు తెలుసు. కాగా పట్టణంలోని నివాసాలు మధ్య కొందరు పందుల పెంపకం చేస్తున్నారు. దీనిపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. పట్టణంలో 10 నుంచి 15 వేల వరకు పందులు ఉన్నాయి. వీటిలో సింహ భాగం పట్టణంలోని నివాస ప్రాంతాల్లో ఉన్నాయి. పందుల పెంపకందారులు అధికారులను సైతం ప్రభావితం చేస్తున్నారు. ఏటా రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నారు. ఎవరైనా తనిఖీలకు వస్తే భారీగా ముడుపులు ముట్టచెప్పడంతో అధికారులు మౌనం వహిస్తున్నారు. పందుల సంచారంపై ప్రజలు గగ్గోలు పెట్టడంతో అధికారులు వాటి నివారణకు చర్యలు తీసుకున్నారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన బృందంతో మున్సిపల్ అధికారులు కాంట్రాక్ట్ కుదుర్చుకున్నారు. రెండు నెలలకు ఒకసారి పట్టణంలో పందులను పట్టుకుని తీసుకువెళ్లాలి. ఇదంతా రికార్డుల్లో చూపించిన లెక్కలు మాత్రమే. వాస్తవానికి పట్టణంలో ఎక్కడ చూసినా పందుల సంచారం యథేచ్ఛగా సాగుతోంది. ప్రజా ఆరోగ్యశాఖలో ఉన్న దిగువ స్థాయి సిబ్బందికి పశువుల పెంపకందారులతో సంబంధాలు ఉన్నాయి. దీంతో పందులు పట్టుకోవడానికి బృందాలు వస్తున్నాయన్న సమాచారన్ని పెంపకం దారులకు ముందుగానే చేరవేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇబ్బందిగా మారిన మురుగు

పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో మురుగ నీటి గుంతలు ఉన్నాయి. ఈ గుంతల్లో మురుగు నీటితో



మార్కెట్ యార్డు రైతు బజారులో మురుగునీరు

పాటు వర్షం నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో మురికి నీరు రోజుల తరబడి నిల్వ ఉండిపోవడంతో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంది. పట్టణంలో దోమలు పెరిగిపోయి చికెన్ గున్యా, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు సోకుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణ పరిధిలోని ఖాళీ స్థలాల యాజమానులకు అధికారులు నోటీసులు జారీ చేసినా ఫలితం కానరావడం లేదు.

ప్రజలకు అవగాహన

ప్రజారోగ్యశాఖ అధికారులు దోమలకు ఆవాసా కేంద్రాలుగా ఉన్న గుంతల్లో గంబూషియా చేప పిల్లలను వేస్తున్నారు. ఇవి దోమల లార్వాను తినడం ద్వారా కొంత వరకూ దోమల వ్యాప్తి తగ్గుతుంది. తద్వారా వ్యాధులను అరికట్టవచ్చు. సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పట్టణంలో రోజువారీ వినియోగించే ఖాళీ కొబ్బరి బొండాలను శివారు ప్రాంతాల్లో రోడ్లపై వేస్తున్నారు. వీటిలోకి వర్షం నీరు చేరి దోమల ఉత్పత్తికి ఆవాసాలుగా ఉన్నాయి. ప్రజలు పరిశుభ్రత పాటిస్తే వ్యాధులను నియంత్రించవచ్చు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



పట్టణంలో ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. అన్ని ప్రాంతాల ప్రజలకూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నాం. నివాస ప్రాంతాల్లో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. ప్రజలు చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన డంపర్ బిన్స్‌లో వ్యర్థాలను వేయాలి. రోడ్లపై వ్యర్థాలను వేయకుండా సహకరించాలి. రద్దీగా ఉండే రైతు బజారు, మార్కెట్లు వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. మురుగు కాల్వల్లో పేరుకు పోయిన పూడికను తొలగిస్తున్నాం. దోమల నియంత్రణ కోసం ఫాగింగ్ చేస్తున్నాం.

– వెంకట్రావు, మున్సిపల్ కమిషనర్, తుని

మోతాదుకు మించితే ముప్పు



నెల్లిపూడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ గాంధీ

శంఖవరం: ఖరీఫ్ సాగులో మోతాదుకు మించి ఎరువుల వాడితే పంటకు నష్టం కలుగుతుందని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ అన్నారు. మండలంలోని నెల్లిపూడి, కొంతంగి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఎరువులు ఎక్కువగా వాడడం వల్ల భూసారం క్షీణిస్తుందన్నారు. వరి సాగులో తీసుకోవల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మణికంఠ, రాజు, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యాంటీబయాటిక్స్ దుర్వినియోగంతో రెసిస్టెన్స్ సమస్యలు

గండేపల్లి: ఫార్మ్లీలలో యాంటీబయాటిక్స్ దుర్వినియోగం వలన మానవులకు రెసిస్టెన్స్ సమస్యలు తలెత్తుతున్నాయని స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ డి.సతీష్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో మంగళవారం యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్, టైఫాయిడ్ వ్యాక్సినేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైఫాయిడ్ వ్యాక్సినేషన్ ద్వారా సంక్రమణలను నిరోధించవచ్చన్నారు. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ దేశంలో మరణాల రేటును పెంచుతూ ప్రధాన సవాలుగా మారుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ భాస్కరరావు, మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు



ఎ.కొత్తపల్లిలో నీట మునిగిన వరి చేలను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు

తొండంగి: కుండపోత వర్షాలకు తొండంగి, కోటనందూరు మండలాల్లో వరిపొలాలు నీట మునిగాయి. కాగా వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని ఎ.కొత్తపల్లిలో ముంపునకు గురైన వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఇటీవల కురిసిన కుండపోత వర్షాలకు ఎగువప్రాంతం నుంచి వచ్చిన వరద నీటికి వరి పొలాలను ముంచెత్తడంతో పంటలు దెబ్బతిన్నాయని రైతులు తెలిపారు. ఆయన బాధిత రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పొలాలను దమ్ములు చేయించి వరినాట్లు వేసిన కొద్ది రోజుల్లోనే ముంపునకు గురవ్వడంతో నాట్లు వేసిన వరి చేను కుళ్లిపోతుందని రైతులు వాపోయారు. నియోజకవర్గంలో కోటనందూరు, తుని, తొండంగి మండలాల్లో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని యనమల కృష్ణుడు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బత్తుల వీరబాబు, బూత్ కన్వీనర్ల విభాగం రాష్ట్ర జనరల్ కార్యదర్శి బెక్కం చంద్రగిరి, మాధన నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వరి పొలాల పరిశీలన

గోకవరం: మండలంలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను మంగళవారం తూర్పుగోదావరి జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్ర వేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు పరిశీలించారు. జిల్లా వనరుల కేంద్రం, కోరుకొండ ఏడీఏఎస్ జయరామలక్ష్మి, స్థానిక వ్యవసాయ అధికారి రాజేశ్వరిలతో కలిసి తంటికొండలో పాక్షికంగా నీట మునిగిన వరి చేలను పరిశీలించారు. రైతులకు యాజమాన్య పద్ధతులను సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షపాతం సాధారణ స్థితిలోనే ఉందని, ఎక్కడా పంట ముంపునకు గురికాలేదన్నారు. ఈ వర్షాలు పంట ఎదుగుదలకు దోహదం చేయడమే కాకుండా ఆకు ముడత, ఆకునల్లి పురుగులు వర్షాలకు కొట్టుకుపోయాయన్నారు. రైతులు ఆందోళన చెందవద్దన్నారు. తెగుళ్ల నివారణకు లీటరు నీటికి 1.0 గ్రాములు కార్బెన్డిజిమ్ లేదా 2.0 గ్రాముల కార్బెన్డిజిమ్, మాంకోజెబ్ కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. పిలకలు కట్టే దశలో నీట మునిగిన వరి పొలం త్వరగా పుంజుకోవడానికి వీలైనంత త్వరగా నీటిని తీసివేసి ఎకరానికి 20 కిలోల యూరియా, 10 నుంచి 15 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

160 ఎకరాల్లో పంట నష్టం

తుని రూరల్: మండలంలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు 160 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్టు మండల వ్యవసాయ విస్తరణ అధికారి కేవీ శివకుమారి తెలిపారు. మంగళవారం ఆమె రాపాక, కేఓ మల్లవరం, దొండవాక గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 613 ఎకరాల్లో వరినాట్లు వేయగా 20 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందన్నారు. 593 ఎకరాల్లో పత్తి వేయగా 140 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నట్టు గుర్తించామన్నారు. నివేదికను ఉన్నత అధికారులకు అందజేస్తామని తెలిపారు.



తంటికొండలో రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త వెంకటనరసింహారావు

తెరిపిచ్చిన వాన

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం మంగళవారం కాస్త తెరిపిచ్చింది. మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదనీటితో మండలంలోని పల్లపు ప్రాంతాల్లో పంట పొలాలు ముంపు బారినపడ్డాయి. పలు గ్రామాల్లో వీధులు జలమయం కావడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా వర్షం తెరిపిచ్చింది. ప్రజలు యథావిధిగా తమ కార్యకలాపాలు సాగించారు. వర్షాల ప్రభావంతో ఇటుకల తయారీ కేంద్రాలు, భవన నిర్మాణాల పనులు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మర్రిపాక సర్పంచ్ ఆనందరావును సత్కరిస్తున్న స్టేట్ బ్యాంక్ అధికారులు

జగ్గంపేట: సైబర్ నేరాలపై బ్యాంక్ ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం (ఎల్‌హెచ్‌ఓ అమరావతి) హేమంత్ కుమార్ సూచించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జగ్గంపేట శాఖ మేనేజర్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని మర్రిపాక, గుర్రంపాలెం పంచాయతీల స్థాయి సాచురేషన్ శిబిరాన్ని మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు, సైబర్ నేరాల నివారణ, బ్యాంక్ లావాదేవీలు మరింత సులువుగా జరుపుకోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మర్రిపాక, గుర్రంపాలెం పంచాయతీలకు చెందిన 200 మంది హాజరయ్యారు. ఆయా గ్రామాల సర్పంచులు జగతం ఆనందరావు, చీపురుపల్లి లక్ష్మిరాఘవ, జగ్గంపేట ఎంపీడీఓ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ పార్థసారథిలను స్టేట్ బ్యాంక్ ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తుని రీజియన్ ఆర్‌ఎం ప్రసాదరావు, ఏజీఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న పరిశ్రమలకు ఉద్యమ ఆధార్ కీలకం



ప్రత్తిపాడు ఉద్యమ ఆధార్ శిబిరంలో పేర్లను నమోదు చేసుకుంటున్న లబ్ధిదారులు

ప్రత్తిపాడు: సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఉద్యమ ఆధార్ సర్టిఫికెట్ ఎంతో కీలకమని డ్వామా పీడీ జి.శ్రీనివాసరావు అన్నారు. ప్రత్తిపాడు వెలుగు మండల సమాఖ్య కార్యాలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన ఉద్యమ ఆధార్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ ఆధార్ సర్టిఫికెట్ పొందేందుకు వ్యయ ప్రయాసలకు లోనుకాకుండా ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఈ ఉద్యమ ఆధార్ సర్టిఫికెట్ ఉంటే ప్రభుత్వం కల్పించే ఉపాధి పథకాలు, వ్యాపారాల అభివృద్ధికి బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు వీలు కలుగుతుందన్నారు. శిబిరంలో 204 మంది ఉద్యమ ఆధార్ సర్టిఫికెట్ కోసం నమోదు చేసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో డీపీఎం వీవీఆర్ రాయ్, డీపీఎం ఎ.కేశవరావు, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల శాఖ అధికారి అనిల్, వెలుగు ఏపీఎం జి.శ్రీనివాసరావు, వై.వెంకట్, సీసీలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



సీనియర్ ఫొటోగ్రాఫర్లను సన్మానించిన అసోసియేషన్ సభ్యులు

గోకవరం: మండల ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో అసోసియేషన్ అధ్యక్షుడు సన్నపు శాంతిబాబు ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ జాక్విస్ మండ్‌డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ ఫొటోగ్రాఫర్లు బాలు స్టూడియో బాలు, సూరిబాబు, అరసాల మోహన్, గంధం బుజ్జి, తోలేటి రామ్‌ప్రసాద్‌లను సన్మానించారు. మండలం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శివ, మాజీ ప్రెసిడెంట్ పల్లెల కొండలు, సెక్రెటరీ లావరాజు, మాజీ సెక్రెటరీ సతీష్, జాయింట్ సెక్రెటరీ రత్నరాజు, మాజీ ట్రెజరర్ స్టూడియో రాజ్, గౌతమ్ స్టూడియో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పరదేశమ్మతల్లి జాతర



పరదేశమ్మ అమ్మవారు

తుని రూరల్: కొత్త సూరవరంలో వేంచేసిన పరదేశమ్మతల్లి జాతరను బుధ, గురువారాల్లో నిర్వహించనున్నట్టు పరదేశమ్మ బాలభక్త వినాయక సంఘం (ఆలయ కమిటీ) అధ్యక్ష కార్యదర్శులు నల్లల వరహాలరావు, తర్రా దొరబాబు మంగళవారం తెలిపారు. బుధవారం సాయంత్రం ఆరు గంటల నుంచి గురువారం ఉదయం ఆరు గంటలు వరకు జాతర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జాతరను పురస్కరించుకుని సినీ, టీవీ నటులతో విశాఖపట్నం వారిచే డీజే డ్యాన్స్ బేబీ డాన్స్, వాడపల్లి వారితో మ్యూజికల్ నైట్ అండ్ సూర్య ఆర్కెస్ట్రా, రాజుబాయ్ ఈ వెంట్స్ విశాఖపట్నం వారితో డ్యాన్స్ బేబీ డాన్స్. మరువాడ వారితో వెంకటరమణ మూర్తి పాట, శ్రీరాంపురం కళాకారులతో గరగల నృత్యాలు, పెద్దపాడు నీలమ్మతల్లి కళా బృందంతో బుర్రకథ, విద్యుత్ దీపాలంకరణలు, బాణసంచా కాల్పులు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గురువారం అమ్మవారికి తీర్థం నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించేందుకు ప్రత్యేక క్యూలైన్లు, తాగునీరు, మజ్జిగ, తదితర ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. భక్తులు తరలివచ్చి అమ్మవారి దర్శించి కృపకు పాత్రులు కావాలని కోరారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

- సినీ గాయని కౌసల్య



శ్రీప్రకాష్‌లో గాయని కౌసల్యను సత్కరిస్తున్న విజయ్ ప్రకాష్

తుని: విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించేందుకు నిత్యం కృషి చేయాలని సినీ గాయని కౌసల్య సూచించారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల 49వ వ్యవస్థాపక వేడుకలు రెండు రోజుల పాటు ఘనంగా జరిగాయి. మంగళవారం విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ ఆధ్వర్యంలో ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సినీ గాయని కౌసల్య, కీబోర్డు ప్లేయర్ రవిశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన గాతా రహే మేరా దిల్ పాటల పోటీల్లో ఆరో తరగతి నుంచి డిగ్రీ వరకూ జూనియర్, సీనియర్ విభాగాల్లో విద్యార్థులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతులుగా సినీ గాయని కౌసల్య, కీబోర్డు ప్లేయర్ రవి శేఖర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా కౌసల్య మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కౌసల్య తన పాటలతో అందరిని అలరింప చేశారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ 49 ఏళ్లగా విలువలతో కూడిన విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. పాటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. తొలుత మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, భానుమూర్తి, బంగార్రాజు, రామకృష్ణారెడ్డి, సీతారాణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల కృత్రిమ గర్భధారణతో రైతులకు లాభాలు



కత్తిపూడి పశు వైద్యశాలలో రికార్డులను పరిశీలిస్తున్న కాంతారావు

శంఖవరం: పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ ద్వారా రైతులకు ఆర్థికంగా లాభం చేకూరుతుందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పశుగణాభివృద్ధి సమస్త కార్యనిర్వహణ అధికారి కె.కాంతారావు అన్నారు. మండలంలోని కత్తిపూడి పశు వైద్యశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని పెంచడంలో పశుసంవర్ధక శాఖ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ముఖ్యంగా మేలు జాతి పశువులే అధిక పాలు ఇస్తాయని తెలిపారు. కృత్రిమ గర్భధారణ ద్వారా పాడి పశువులకు నాణ్యమైన మేలు జాతి పశువుల వీర్యాన్ని తక్కువ ధరలో అందిస్తున్నట్టు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి కాకర్ల ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ఆందోళన



ఏలేశ్వరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

ఏలేశ్వరం: ఉచిత బస్సు పథకం అమలుతో తాము రోడ్డున పడ్డామంటూ మంగళవారం ఏలేశ్వరం, యర్రవరంలో ఆటో కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఆటోలను నిలుపుదల చేసి కార్మికులు పాదయాత్రగా నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన స్త్రీ శక్తి పథకంతో తామంతా రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. ఉచిత బస్సు పథకం అమలుతో ఆటోలు ఎక్కే ప్రయాణికులు తగ్గిపోయారన్నారు. ఆటోలపై ఆధారపడి జీవిస్తున్న తమ కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. తామంతా నష్టపోకుండా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నీలి నాగేశ్వరరావు, కూని వసంతకుమార్, కుప్పల నాగభూషణం, జోగా సత్తిబాబు, నడికట్ల వెంకన్న, మత్సా శ్రీనివాస్, షేక్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి ఆరుద్ర నక్షత్ర పూజలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రసిద్ధిగాంచిన రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం శ్రావణ మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు స్వామివారికి పూజలు, రుద్రాభిషేకం నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం సప్త హారతులు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు ఆలయ సేవా సభ్యులు భక్తులు స్వామివార్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.